క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్యపూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.

వైద్యాధికారిగా వినోద్

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా వినోద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి శివలింగమ్మ ప్రసూతి సెలువుపై వెళ్లారు. ఈమె స్థానంలో జిల్లా వైద్యాధికారులు కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వినోద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చన, వడమాల, ఆకుపూజలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

నంద్యాల(అర్బన్): ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలని ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా మండలంలోని పుసులూరు, మిట్నాల, గుంతనాల, బ్రహ్మణ, చాపిరేవుల తదితర గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో ఉన్న బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగింపజేయించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా పోస్టర్లు ఉంటే తొలగించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, అంకన్న ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని 12, 20వ వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం 20వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను పరిశీలించారు. అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి ఉన్నారు.


కంప్యూటర్ పరిజ్ఞానంతోనే ఉద్యోగావకాశాలు

నంద్యాల(న్యూటౌన్): ప్రస్తుతం కంప్యూటర్ పరిజ్ఞానంతోనే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో జాతీయ స్థాయి ఐటీ ఫెస్ట్–2కే24 కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త ఆవిష్కరణలవైపు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు వివిధ అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

బొమ్మలసత్రం: బొమ్మలసత్రం సమీపంలో శుక్రవారం రాత్రి రైలు ఢీ కొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టాలపై రక్త గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన రైల్వే సిబ్బంది ఆయనను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. నంద్యాల రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డికి చెందిన 58 మామిడి చెట్లు, పశుగ్రాసం, కాలిబూడిదయ్యాయి. వివరాలు.. గ్రామానికి కొద్ది దూరంలోనున్న పొలంలో మామిడితోట సాగు చేశారు. అలాగే పాడి పోషణార్థం పశుగ్రాసం నిల్వ ఉంచారు. ఉన్నఫలంగా మంటలు చెలరేగడంతో ఆయన అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. వీఆర్‌ఓ నారాయణ ప్రమాద స్థలానికి చేరుకొని తహసీల్దార్ మురళీమోహన్‌కు నివేదించారు. కాగా.. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని మనోహర్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధి మెరిసే.. పల్లె మురిసే

- కోట్లాది రూపాయలతో ఆలమూరులో అభివృద్ధి పనులు
- రూ. 3కోట్లతో మూడు పాఠశాలల్లో వసతుల కల్పన
- రూ.1.85 కోట్లతో పీహెచ్‌సీ భవనం నిర్మాణం
- దాళారీ వ్యవస్థ నిర్మూలనకు రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం ఏర్పాటు
- సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు చేకూరిన లబ్ధి రూ.23 కోట్లు

ఆలమూరు.. తమలపాకులు, అరటి సాగుతో పాటు వాటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ ఖ్యాతి గాంచింది. అయినా.. అభివృద్ధికి దూరంగా నిలిచిపోయింది. దిగుబడులను నిత్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు వాహనాలు వస్తున్నా రోడ్డు సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. ఇక ఏ చిన్నపాటి జబ్బు చేసినా ఆళ్లగడ్డ, రుద్రవరం, నంద్యాల తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నాటి పాలకులకు పట్టలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో ప్రగతి కాంతులు విరజిమ్మాయి. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రూ.1.85 కోట్లతో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం



బెంచీలపై చదువుకుంటున్న విద్యార్థులు



ఎస్సీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు

ప్రత్యక్ష పద్ధతిలో ప్రజలకు చేకూరిన లబ్ధి (డీబీటీ)	రూ.23 కోట్లు
నాన్ డీబీటీ కింద అందిన ప్రయోజనం	రూ.8 కోట్లు
గ్రామాభివృద్ధి ఇలా..	
నాడు–నేడు (3 పాఠశాలలకు)	రూ.3 కోట్లు
నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణానికి	రూ. 1.85 కోట్లు
ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద దాదాపు	రూ.91లక్షలు
గ్రామ సచివాలయం	రూ.40లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.24లక్షలు
గడప గడపకు నిధులు	రూ.20లక్షలు
గ్రామ పంచాయతీ నిధులు	రూ.20లక్షలు



రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం

రుద్రవరం: సంక్షేమం.. అభివృద్ధి గురించి చర్చ వస్తే వైఎస్సార్‌సీపీకి ముందు, తరువాత అని మాట్లాడాల్సిన పరిస్థితి. గతంలో కేవలం తాము, తమ సంబంధీకులు బాగు పడాలని ప్రజాప్రతినిధులు, పాలకులు పనిచేశారు. ప్రజల కష్టాలను పట్టించుకోకపోవడంతో ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన గ్రామాలు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. అలాంటిదే మండలంలోని ఆలమూరు గ్రామం. ఇక్కడి రైతులు తమలపాకు, అరటి సాగులో దిట్ట. కేవలం సాగుకే పరిమితం కాకుండా తమ దిగుబడులను మార్కెటింగ్ చేసుకోవడంలో నేర్పరులు. ఎంతలా అంటే తమ దిగుబడులను ఇతర రాష్ట్రాలకు నేరుగా ఎగుమతి చేసేంతలా. అయినా గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. మోకాలి లోతు గుంతలతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. వర్షాకాలంలో గ్రామస్తుల అవస్థలు వర్ణనాతీతం. ఇక వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. జబ్బు చేస్తే చాలు పట్టణాలు, పక్క గ్రామాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. అందరి లాగే వీరు కూడా ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని వేడుకున్నారు. అయినా వారు కరుణించలేదు. ఏదీ శాశ్వతం కాదన్నది వీరి విషయంలో నిజమైంది. అహంకారులైన పాలకులను తరిమి తమకు నచ్చిన



ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. అంతే.. నేడు ఆ గ్రామంలో కోట్లాది రూపాయలతో ప్రభుత్వ కార్యాలయాలు, వసతులు అన్నీ సమకూరాయి. అంతేకాదండోయ్.. ఊర్లోని అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో ప్రతి ఇంట సంతోషాలు విరబూసేలా చేసింది సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం.

దళారీ వ్యవస్థకు చెక్..

వైఎస్సార్‌సీపీకి ముందు ఏ ప్రభుత్వ పని కావాలన్నా.. అభివృద్ధి పనులు చేపట్టాలన్నా.. సంక్షేమ పథకం వర్తించాలన్నా.. గ్రామంలోని కొందరు దళారులకు అడిగినంత సమర్పించుకోవాల్సిందే. జగనన్న పాలన మొదలయ్యాక..గ్రామ రూపురేఖలు మారిపోయాయి. ప్రజలు అడక్కుండానే వసతులన్నీ సమకూర్చారు. నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందజేశారు.దళారీ వ్యవస్థ నిర్మూలనలో భాగంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అమలు చేశారు. ఓసీ,బీసీ,ఎస్సీ,మైనార్టీ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, డ్రైనేజీలు, మినీ వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్లు, ఇంటింటికీ కుళాయిలు వేయించారు. గ్రామంలో వైద్యశాల భవనం శిథిలమవడంతో రూ.1.85 కోట్లు మంజూరు చేసి ఆధునిక సౌకర్యాలతో నూతన పీహెచ్‌సీ భవనం నిర్మించారు. గ్రామంలో మూడు ప్రభుత్వ పాఠశాలలను రూ.3కోట్లతో తీర్చిదిద్దారు.ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని సీసీ రోడ్డు, తారు రోడ్డుగా మార్చారు. గ్రామంలోని ప్రధాన రహదారి, మురుగు సమస్య తీర్చారు. గ్రామ శివారులోని శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించారు. అన్ని రకాల వసతులు కల్పించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంతకు ముందు ఇన్ని పనులు ఎవరూ చేయలేదు



గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. సమస్యలతో అలమటించాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. ప్రధానంగా రోడ్లు, మురుగు సమస్య, హాస్పిటల్, సచివాలయం, ఆర్బీకే తదితర వాటితో ఇబ్బందులు తొలగాయి. అలాగే సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు లబ్ధి పొందాయి.

– బ్రహ్మయ్య, గ్రామస్తుడు

ప్రభుత్వ సహకారంతోనే..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు స్థానికంగా గంగుల కుటుంబం సహకారంతో సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా ఖర్చు చేయడంతో సమస్యలు తొలగాయి. ఇంతటి అభివృద్ధి మా గ్రామం చూడలేదు. అన్ని రకాలుగా గ్రామాన్ని తీర్చిదిద్దారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే గ్రామలన్నీ బాగుపడతాయి.

– నాగేష్, స్థానికుడు

కష్టాలు తప్పాయి



గతంలో ఏదైన ధ్రువ పత్రం పొందాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉండేది. అప్పట్లో కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండేవారు కాదు. ఇలా పలుమార్లు తిరిగితే కానీ పనులయ్యేవి కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఊర్లోనే అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఏ పని అయినా సులభంగా, నిర్ణీత గడువులోగా అందుతున్నాయి. మాకు ఇబ్బందులు తప్పాయి.

– శూలం ప్రభాకర్, గ్రామస్తుడు

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: సాధారణ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ కమిటీ నుంచి సోషల్ మీడియా, కేబుల్ ఛానెళ్ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి జేసీ ఛాంబర్‌లో కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, పెయిడ్ న్యూస్‌ను పర్యవేక్షించి సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేస్తుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. స్వీకరించిన దరఖాస్తులను జిల్లాస్థాయి ఎంసీఎంసీ కమిటీ పరిశీలించి అనుమతిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. అలాగే పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు వార్తాపత్రికల్లో ప్రకటనలు ఇచ్చేందుకు తప్పనిసరిగా అనుమతి పొంది ప్రచురించాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్ డిస్‌ప్లేలు, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజీలు వస్తాయని, అలాగే ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్లు, వికీపీడియా తదితర ప్రసారాలను కూడా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సినిమా హాళ్లలోనూ ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకూ ముందస్తు ధ్రువీకరణ పొందాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పరిగణించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సంబంధిత అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. డీఆర్‌ఓ పద్మజ, ఎంసీఎంసీ సభ్యులు ప్రభాకర్ చౌదరి, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

వారికి మినహాయింపు ఇవ్వాలి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి మూల్యాంకన విధుల కేటాయింపులో 60సంవత్సరాలు పైబడిన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ సుబ్బన్న, శివయ్య కోరారు. ఈ మేరకు శనివారం డీఈఓ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని నంద్యాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రసాద్, అజామ్‌బేగ్, జమాల్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ఆపదే!

- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం
- ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చు
- బాధితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



డోన్‌లో ఇంటింటి సర్వేలో వ్యాధి గురించి అవగాహన కలిగిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

నంద్యాల టౌన్ : ఎడతెరిపినివ్వని దగ్గు.. ఆకలి మందగించడం.. ఛాతినొప్పి.. విపరీతమైన అలసట. ఇవన్నీ క్షయ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి బారిన పడిన వారు వైద్యుల సూచనలు పాటిస్తూ ప్రభుత్వం అందజేస్తున్న మందులు క్రమం తప్పకుండా వినియోగిస్తే వ్యాధి నుంచి సులువుగానే బయటపడవచ్చు. అయితే ఏమాత్రం అలసత్వం వహించినా ప్రాణానికి ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధిపై అవగాహన పెంచేందుకు ప్రపంచ వ్యాప్తంగా మార్చి 24వ తేదీన క్షయ నివారణ దినోత్సవం నిర్వహిస్తారు.

ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం..

క్షయ అంటువ్యాధి. ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కొంత కాలానికి మెదడు, ఎముకలు, మూత్రపిండాలు, పేగులు, చర్మం తదితర అవయవాలు ప్రభావితమై ప్రాణాంతకంగా మారుతుంది. ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యవస్థ దెబ్బతినడం వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ప్రభుత్వం అందించే మందులు వాడి, పోషకాహారం తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, కిడ్నీ, హెచ్ఐవీ–ఎయిడ్స్, సిలికోసిస్, ఆర్థరైటిస్, సొరియాసిస్ బాధితులు, పోషకాహారం లోపంతో ఉన్నవారు ఎక్కువగా ఈ వ్యాధి బారినపడే అవకాశముంది. పుట్టిన బిడ్డకు 21 రోజుల్లోగా టీబీ నివారణ టీకా వేయించాలి.

లక్షణాలు..

రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గిపోవటం, ఆకలి మందగించటం, రాత్రి వేళల్లో జ్వరం రావటం, చమటలు పట్టడం వ్యాధి లక్షణాలు. వ్యాధి సోకిన వారు దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపరలు మీద పడటం ద్వారా వ్యాధి సోకుతుంది.


అండగా ప్రభుత్వం..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి చికిత్సకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. వారికి డాట్ ప్రొవైడర్ల ద్వారా 6 నుంచి 8 నెలల పాటు మందులు అందజేస్తున్నారు. వైద్యులు సూచించిన విధంగా నిర్ణీత సమయం మందులు వాడకపోతే అది మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా మారుతుంది. దీనికి రెండేళ్ల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. రూ. 2లక్షల నుంచి రూ.18 లక్షల విలువజేసే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. మందులతో పాటు పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.500 చొప్పున అందజేస్తుంది. అలాగే మందులు మింగించిన పర్యవేక్షకులకు (డాట్ ప్రొవైడర్)లకు రూ.వెయ్యి నుంచి రూ.5వేలు పారితోషికం ఇస్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించిన వైద్యులకు కేసుకు రూ.500 చొప్పున అందజేస్తున్నారు. క్షయ ఉన్న 4,955 మంది బ్యాంకు ఖాతాలు సేకరించి వారికి ప్రతి నెలా రూ.500 చొప్పున ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.98,06,000 జమ చేశారు.

టీబీ పరీక్షల వివరాలు...

సంవత్సరం	పరీక్షలు	బాధితులు
2015	8,073	2,901
2016	15,900	2,822
2017	16,024	2,855
2018	7,244	3,770
2019	17,909	4,110
2020	23,062	2,791
2021	29,346	3,467
2022	18,049	3,398
2023	30,154	3,478
2024(ఇప్పటివరకు)	2,624	516

మందులు క్రమం తప్పకుండా వాడాలి



జిల్లాలో క్షయ వ్యాధిని అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. రోగులు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలి. చాలామంది పూర్తి కోర్సు వాడటం లేదు. కొన్నాళ్లు వాడి మానేస్తున్నారు. ఇటువంటి వారి వల్లే వ్యాధి వ్యాపిస్తుంది. మందులు వాడేందుకు ఆయా గ్రామాల్లో ఆశా వర్కర్, ఏఎన్ఎంకు ట్రాకింగ్ బాధ్యతలు అప్పగిస్తున్నాం. పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి బయటపడవచ్చు.

– శారద బాయి, జిల్లా క్షయ నివారణ అధికారి, నంద్యాల

సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు

శిరివెళ్ల: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర పోలీస్ బలగాలను ఏర్పాటు చేస్తామని సీఐ చంద్రబాబు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శిరివెళ్ల సర్కిల్ పరిధిలో 41 లైసెన్స్‌డ్ ఆయుధాలున్నాయన్నారు. శిరివెళ్ల స్టేషన్ పరిధిలో 15, రుద్రవరంలో 26 ఆయుధాలున్నాయని చెప్పారు. సర్కిల్‌లో 67 కేంద్రాల్లో 113 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, శిరివెళ్ల మండలంలో బోయలకుంట్ల, గోవిందపల్లె, యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రాల వద్ద కేంద్ర బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లకు మనోధైర్యం కల్పించేందుకు ఇప్పటికే సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జవాన్లతో కలిసి కవాతు నిర్వహించామని పేర్కొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ఆళ్లగడ్డ: అహోబిలం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని పోటీల నిర్వాహకుడు వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాసారి వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాలపండ్ల విభాగం పోటీల్లో పాల్గొనే వారు 24వ తేదీ సాయంత్రం, మొదటి కేటగిరీ ఎద్దులు 25వ తేదీ సాయంత్రంలోగా దిగువ అహోబిలం చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పాలపండ్ల విభాగంలో విజేతలకు వరుసగా.. రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ. 3 వేలు అందజేస్తామని చెప్పారు. మొదటి కేటగిరీ ఎద్దుల పోటీల విజేతలకు వరుసగా.. రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ప్రదానం చేస్తామని వివరించారు.





నాడు: అధ్వానంగా చాకరాజువేముల-డబ్బ్యూ గోవిందిన్నె దారి, నేడు: తారు రోడ్డు వేసిన దృశ్యం

ప్రయాణం సాఫీగా..

దొర్నిపాడు: ఒకప్పుడు అడుగుకో గుంత.. గజానికో గొయ్యి.. విసుగు చెందేలా ప్రయాణం. అయినా మరో మార్గం లేక ఆ దారిలోనే దశాబ్దకాలంగా చాకరాజువేముల– డబ్ల్యూ గోవిందిన్నె గ్రామస్తులు రాకపోకలు సాగించారు . నాలుగు కిలోమీటర్లు ఉన్న ఈ దారిని బాగు చేయాలని గతంలో కోరినా ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల చెవికెక్కలేదు. ఫలితంగా ప్రజలకు కష్టాలు కొనసాగాయి. ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేయడంతో పనులు పూర్తి చేశారు. దీంతో ఈ దారిలో ఉన్న పొలాలకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం తమ ప్రయాణం సాఫీగా సాగుతోందని రెండు గ్రామల ప్రజలు పేర్కొంటున్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జగదీష్ చంద్రారెడ్డి

రుద్రవరం: స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలని ఫ్యామిలీ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. వైద్యశాలలో రాజకీయ నాయకుల చిత్రాలు, గుర్తులు ఉండరాదన్నారు. డాక్టర్ జ్యోతి ఉన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దాం

నంద్యాల(న్యూటౌన్): భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలని సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు భగత్‌సింగ్ సేవలను కొనియాడారు. అలాగే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. రఫీ, బాలాజీ, రాంబాబు, షాహిదీ నివాళులర్పించారు.

మహిళా ఓటర్లే అధికం

శిరివెళ్ల: మండలంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఓటర్ల సవరణ, మార్పులు, చేర్పుల అనంతరం ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. అందులో మండలంలో 46,939 మంది ఓటర్లుండగా.. మహిళా ఓటర్లు 23,590 మంది ఉన్నారు. పురుషులు 23,349 మంది ఉన్నారు. కాగా ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇంత వరకు 536 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా,ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(వ్యవసాయం): పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ప్రజల మధ్య సోదర భావం, మతసామర్యాన్ని పెంపొందిస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని భీమవరం రోడ్డులో నున్న ఆల్‌ఫుర్కానా ఈద్గా, మజీద్‌ఖాన్ మసీదుల్లో ఇఫ్తార్‌కు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వార్డు ఇన్‌చార్జి కిరణ్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె మండలం ఎనకండ్ల ప్రాథమిక పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షాషావలి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, విద్యాశాఖ ఏడీ గోపాల్, లక్ష్మీనాయక్, రమేష్, ఖైజర్, సుధాకర్, గోవర్ధన్, లలిత, రఘునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

రుద్రవరం: స్థానిక పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామసుబ్బయ్య తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై అధికారులతో ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, పరీక్ష కేంద్రం వద్ద సమ్మలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చీఫ్ తిరుపతి రెడ్డికి సూచించారు. ఎంఈఓ లక్ష్మి ఉన్నారు.